
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

3★

శనివారం 8 మార్చి 2025

రామగుండం కమిషనర్‌గా అంబర్ కిశోర్ ఝా



కోల్‌సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్‌గా వరంగల్ సీపీగా పని చేస్తున్న అంబర్ కిశోర్ ఝాను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం సీపీగా ఉన్న ఐజీ శ్రీనివాస్‌ను సీఐడీ ఐజీగా బదిలీచేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాలు జారీచేశారు. 2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అంబర్ కిశోర్ ఝా ఆదిలాబాద్ ఏఎస్పీగా పని చేశారు. 2012లో వరంగల్ ఓఎస్డీగా, 2014లో అడిషనల్ ఎస్పీగా పని చేశారు. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా, హైదరాబాద్ సౌత్ జోన్‌డీసీపీగా అంబర్ కిశోర్ ఝా సేవలందించారు. డీఐజీగా పదోన్నతి పొందిన ఆయన రాచకొండ జాయింట్ కమిషనర్‌గా కొన్నాళ్లు పనిచేశారు. అనంతరం వరంగల్ రూరల్ సీపీగా పని చేసిన ఆయన పోలీస్ కమిషనరేట్ సీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

అక్రమార్కులపై పీడీ యాక్టులు

వరంగల్ కమిషనర్‌గా పని చేస్తున్న అంబర్ కిశోర్ ఝా ప్రజలకు అందుబాటులో ఉండే అధికారిగా పేరుంది. రేషన్ బియ్యం అక్రమ రవాణా, గంజాయి, తదితర దందాల్లో నేరస్థులపై పీడీ యాక్టులు పెట్టారు. అదే సమయంలో అవినీతి అధికారులపై కఠినంగా వ్యవహరిస్తారనే పేరుంది. పలువురు ఎస్ఐలు, సీఐలను వేటు వేసిన సందర్భాలున్నాయి.

ఏడాదిలోనే శ్రీనివాస్ బదిలీ...

రామగుండం పోలీస్ కమిషనర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ ఏడాదిలోనే బదిలీ అయ్యారు. డీఐజీగా పని చేస్తున్న శ్రీనివాస్‌కు రామగుండం సీపీగా 2024 ఫిబ్రవరి 12న పోస్టింగ్ ఇచ్చారు. 14న విధుల్లో చేరారు. అదే నెల 24న ఐజీగా పదోన్నతి లభించింది. ఐజీగా పదోన్నతి వచ్చిన తరువాత కూడా ఆయనను సీపీగానే కొనసాగించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఆయన బదిలీ అయ్యారు.

పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్



పెద్దపల్లి డీసీపీగా పుల్లా కరుణాకర్‌ను నియమించారు. ప్రస్తుతం డీసీపీగా ఉన్న చేతనను ఉమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీగా బదిలీ చేశారు. కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన కరుణాకర్ 2010లో పోలీస్‌శాఖలో చేరారు. కడప జిల్లా పొద్దుటూరు, జగిత్యాల, షాద్‌నగర్ డీఎస్పీగా పనిచేశారు. హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీగా పని చేశారు. 2023లో భూపాలపల్లి ఎస్పీగా పనిచేశారు. వెయింటింగ్‌లో ఉన్న ఆయనను పెద్దపల్లి డీసీపీగా బదిలీ చేశారు.

అధికారుల వైఖరితోనే వివాదాలు

- రామగుండంలో మాజీ కార్పొరేటర్లతో తలనొప్పి
- అభివృద్ధి పనుల్లో తలదూరుస్తున్న వైనం
- తలలు పట్టుకుంటున్న కార్పొరేషన్ యంత్రాంగం



కోల్‌సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో అధికారుల వైఖరితో పలు డివిజన్లలో నాయకుల మధ్య వివాదాలు నెలకొంటున్నాయి. మున్సిపల్ పాలకవర్గాలకు పదవీకాలం పూర్తయిన తరువాత ప్రత్యేకాధికారుల పాలనలో పాలకవర్గ బాధ్యతలంతా అధికార యంత్రాంగమే చూసుకోవాలి. కానీ రామగుండం నగరపాలక సంస్థలోని కొన్ని విభాగాలు ఇప్పటికీ మాజీ కార్పొరేటర్ల మాటలకే ప్రాధాన్యతనిస్తుండడంతో వివాదాలు చోటు చేసుకుం టున్నాయి. పాలకవర్గం పదవీకాలం పూర్తయి నెల రోజులు దాటినా కొందరు తామే కార్పొరేటర్లమనే భావనలోనే ఉన్నారు. పదవీకాలం పూర్తయినా అధికారం చెలాయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 50 డివిజన్లు ఉన్నాయి. పాలకవర్గం పదవీకాలం జనవరి 26తో ముగిసింది. ప్రస్తుతం కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లలో టీయూఎఫ్ఐడీసీ, ఎస్‌డీఎఫ్, సింగరేణి సీఎస్ఆర్, 15వ ఆర్థిక సంఘం తదితర నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, మేజర్ నాలాల ఆధునికీకరణ, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం తదితర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ఏడాది ఎన్నికలు ఇతర కారణాలతో అభివృద్ధి పనులు జరగలేదు. కార్పొరేటర్ల పదవీకాలం పూర్తయిన తరువాత ప్రత్యేక అధికారుల పాలనలో పనులు జరుగుతున్నాయి. దీంతో డివిజన్లలో తాము పెట్టిన పనులే జరుగుతున్నాయంటూ అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి హల్‌చల్ చేస్తున్నారు. దగ్గరుండి పనులు చేయిస్తున్నట్టు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండడంతో వివాదాలు మొదలవుతున్నాయి. తాజా మాజీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఆశావాహుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కొన్ని డివిజన్లలో అయితే పనులు జరుగుతున్న ప్రాంతంలోనే గొడవకు దిగుతున్నారు.

ఇటీవల గోదావరిఖని ఫైవింక్లయిన్‌లోని ఒక డివిజన్‌లో ఓపెన్ డ్రైన్ పనుల వద్ద తాజా మాజీ కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్‌కు మధ్య జనం మధ్యనే గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. ఇలాంటి వివాదాలు ఇప్పుడు మెజార్టీ డివిజన్లలో చోటు చేసుకుంటున్నాయి. పని జరిగే చోట అధికారులతో వివాదాలు పడుతున్న సందర్భాలు చోటు చేసుకుంటు న్నాయి. తాజా మాజీ కార్పొరేటర్లకు కొందరు అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఇతర నాయకులు వివాదాలు సృష్టిస్తున్నారు

● అధికార పార్టీలో నేతల మధ్య వివాదాలు

రామగుండం నగరపాలక వర్గానికి త్వరలోఎన్నికలు

మిగతా 6వ పేజీలో...

త్వరలో సఖీ కేంద్ర భవనాన్ని ప్రారంభించాలి



సఖి కేంద్రం వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో నిర్మించిన సఖి కేంద్రం భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. కలెక్టర్ మాట్లాడుతూ సఖీ కేంద్ర భవన నిర్మాణం పూర్తయిందని, ప్రజాప్రతినిధుల సమయం తీసుకుని త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ఆహార నాణ్యతను పరిశీలించారు. మానసిక దివ్యాంగుల కేంద్రంలో వసతులు కల్పించాలని, ప్రభుత్వం అందించే సహాయ కార్యక్రమాలపై నివేదిక అందజేయాలని కలెక్టర్ తెలిపారు. పాత ఆసుపత్రి భవనాన్ని కూల్చివేసేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలన్నారు. పాత ఆసుపత్రిలోని రోగులను మాత శిశు ఆసుపత్రులకు తరలించామని, పాత ఆసుపత్రి స్థానంలో నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలు సిస్టంలో నమోదు చేయాలని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి రవీందర్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



పరీక్ష కేంద్రం వద్ద కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 23పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరగడానికి నిర్వ హించామని ఇంటర్మీడియట్ అధికారి కల్పన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల కేంద్రాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల పరీక్షకు 5043 మంది హాజరుకావాల్సి ఉండగా, 4884 మంది హాజరు కాగా, 159 మంది గైర్హా జరయ్యారు. దీంతో 96.84 శాతం హాజరయ్యారు.

పారిశుధ్య నిర్వహణకు స్పెషల్ డ్రైవ్

- ఈనెల 10 నుంచి 14 వరకు నిర్వహణ
- పన్నులు 100 శాతం వసూలు చేయాలి
- తాగునీటి పైప్‌లైన్ లీకేజీ సమస్యలను పరిష్కరించాలి
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

పెద్దపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామాలలో ఈ నెల 10 నుంచి 14 వరకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి వార్డులో డ్రైవ్ నిర్వహించాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరువేరుగా పంచాయతీ ట్రాక్టర్ ద్వారా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని పేర్కొన్నారు. గ్రామంలోని ఖాళీ స్థలాల్లో ప్లాస్టిక్, చెత్త ఉండకుండా శుభ్రం చేయాలని, గ్రామాలలో పిచ్చి మొక్కలను తొలగించాలని, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపునకు అయ్యే ఖర్చు సదరు స్థలం యజమాని నుంచి వసూలు చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, నర్సరీ, క్రీడా ప్రాంగణాలను శుభ్రంగా ఉండేటట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి, ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజు ఈనెల 15 లోపు వంద శాతం వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలోని అన్ని వార్డులలో ఫాగింగ్ చేయించాలన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, పైప్‌లైన్ లీకేజీలను పరిష్కరించాలని, నీటి ట్యాంకులను రెగ్యులర్‌గా క్లోరినేషన్ చేయాలని సానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను ఎంపీఓలు, ఎంపీడీవోలు, డిఎల్‌పిఓలు, డిపిఓ పర్యవేక్షించాలని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైద్య విద్యార్థులు పేదలకు సేవలందించాలి

- సిమ్స్‌లో ఘనంగా వార్షికోత్సవం



సర్టిఫికెట్ అందజేస్తున్న జీఎం లలిత్‌కుమార్, ప్రిన్సిపాల్ హిమబిందు, అలరించిన నృత్యాలు


కళ్యాణ్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్యం అందించడంలో వైద్య విద్యార్థులు ముందుండాలని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రిన్సిపాల్ హిమబిందు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి నిధులతో 2023లో ప్రారంభమైన మెడికల్ కళాశాల రాష్ట్రంలోనే ఇతర మెడికల్ కళాశాలలకు ఆదర్శమని, అన్నీ హంగులతో ఈ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే పీజీ విద్య కూడా అందుబాటులోకి రానున్నదని చెప్పారు. కళాశాలకు అనుబంధంగా జనరల్ ఆసుపత్రిలో 365 బెడ్ల సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని, దీనికి అనుబంధంగా మరో 362 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి దశకు చేరుకుంటుందని, ఈ ఏడాదిలో కొత్త భవనంలో వైద్య సేవలు ప్రారంభవుతాయని చెప్పారు. గైనకాలజిస్ట్, డెంటల్, ఆప్తమాలిక్, ల్యాప్రోస్కోపి, సిటీ స్కాన్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు 22 డయాగ్నోస్టిక్ సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి నిధులతో ఏర్పాటు చేసిన సిమ్స్‌లో సింగరేణి కార్మికుల పిల్లలకు 7శాతం రిజర్వేష న్‌ను కల్పించామన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సిమ్స్ మెడికల్ కళాశాలలో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో వైద్య విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతు లను ప్రదానం చేశారు. ఐఎంఏ అధ్యక్షుడు క్యాస శ్రీనివాస్, ప్రొఫెసర్లు రాజు, శ్రీదేవి, ఓబులేష్, అశోక్, అనంతబాబు, అనీల్, లక్ష్మి, శిరీష, ధర్మేందర్‌తో పాటు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తోడ్పాటు మహిళల ఆర్థిక పురోగతి

- 'స్వశక్తి'తో ఎదుగుతున్న మహిళలు — 5
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం — 6



రామగుండం రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ఎంపీ



రామగుండంలో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

అంతర్గాం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను శుక్రవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సందర్శించారు. ఆయన రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గల సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తుతానని పేర్కొన్నారు. రామగుండంలో మరికొన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేలా సంబంధిత రైల్వే జీఎం, ఉన్నతాధికారులతో మాట్లాడుతానని పేర్కొన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నేత దివంగత మహమ్మద్ నబీ సాబ్ కుటుంబ సభ్యులను కలిశారు. నాయకులు షేక్ ఇఫ్తెకార్ అహ్మద్, అనుమాస శ్రీనివాస్, పెండ్రు హనుమాన్‌రెడ్డి, మాడ నారాయణరెడ్డి, గడ్డం మధుగౌడ్, సూర తార, ఎండీ సాదిక్, ఇండిబిల్లి రవీందర్ పాల్గొన్నారు.

కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జిని పరిశీలన

పెద్దపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) కూనారం వెళ్లే రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంలో సమస్యలను పరిష్కరించి వెంటనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసకురావాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం



కొనరావుపేటలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, ధర్మారంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

జూలపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన కోనరావుపేటలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజచేసి పనులను ప్రారంభించారు. గ్రామంలోని 144 మంది పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా అందులో 15 ఇండ్లకు ముగ్గులుపోసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడతూ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. తహసీల్దార్ జక్కుని స్వర్ణ, ఎంపిడిఓ పద్మజ, ఎంపిఓ అనిల్‌రెడ్డి, మార్కెట్‌చైర్మెన్ గండు సంజీవ్, నాయకులు వామన్‌రావు, బొజ్జ శ్రీనివాస్, జలపతిరెడ్డి, పర్శరాములుగౌడ్, పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో దళారీ వ్యవస్థకు తావుండదని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. శివపల్లిలో తొమ్మిది ఇందిరమ్మ ఇండ్లకు ఆయన ముగ్గు పోసి భూమిపూజ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తుందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీ నెరవేర్చుతానని పేర్కొన్నారు. నియోజకవర్గానికి ఏడాదిలో 3500ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ప్రతీ లబ్ధిదారునికి రూ.5 లక్షలు చెల్లిస్తుందన్నారు. గతంలో కట్టిన పాత ఇండ్లకు బిల్లులు ఇవ్వరని, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా ప్రత్యేక యాప్‌ద్వారా ప్రభుత్వం పరిశీలించి బిల్లు చెల్లిస్తుందన్నారు. సామ రాజేశ్వర్ రెడ్డి, దుగ్యాల భాస్కర్‌రావు, రవీంద్రనాథ్, శ్రవణ్, నాయకులు రాజనర్సు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, గోపి, పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తానని కేసీఆర్ పేదలను మభ్యపెట్టాడని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బంజేరుపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసి భూమి పూజ చేశారు. అనంతరం విప్ మాట్లాడుతూ బంజేరుపల్లిలో పైలెట్ ప్రాజెక్ట్‌గా 65 మం ది లబ్ధిదారులకు 18 మంది ఇండ్లు నిర్మించుకుంటున్నారని తెలిపారు. ఇండ్ల నిర్మాణం కోసం నీటి కొరత ఉందని విప్ దృష్టికి తీసుకెళ్ళగా బోర్ వేయాలని అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. కొప్పుల నియోజకవర్గానికి చేసింది ఏమిటని ప్రశ్నించారు. మంత్రిగా ఉండి లింక్ కాలువను, పత్తిపాక ప్రాజెక్ట్‌ను ఎందుకు చేయలేదని అన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

వ్యవసాయ మార్కెట్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మెన్ లావుడ్యా రూప్లానాయక్‌తో కలిసి ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తహసీల్దార్ వకీల్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ కె.రమేష్, పీఆర్ ఏఈ రాజశేఖర్, లింగయ్య, తిరుపతి రెడ్డి, హన్మయ్య పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల పట్టివేత



దొంగలను తాళ్లతో కట్టేసిన స్థానికులు

పెద్దపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను స్థానికులు పట్టుకున్నారు. ఈసాలతక్కళ్ళపల్లికి చెందిన ఓవ్యక్తి హైదరాబాద్ వెళ్ళేందుకు గురువారం పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ట్రెయిన్ ఆలస్యంగా ఉండడంతో అక్కడే ఒకచోట కూర్చోగా ఇద్దరు వ్యక్తులు అనుమానంగా తిరుగుతూ కనిపించారు. కొంతసేపటి తరువాత సెల్‌ఫోన్ కనబడలేదు. దీంతో గురువారం రాత్రంతా వెతుకగా తెల్లవారు స్థానికుల సహాయంతో ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. రెండు సెల్‌ఫోన్లలో ఒకటి తిరిగి ఇచ్చారు. ఇద్దరి చేతులను తాళ్ళతో కట్టి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని చెప్పారు. కాగా, పోలీస్‌స్టేషన్లో ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. చోరీకి పాల్పడిన నిందితులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సతీష్, రాములుగా తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన జీవన్

తంగళ్లపల్లి (సిరిసిల్లరూరల్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దెనపల్లి గ్రామంలో ఇంటి ముందు ఆడుకుంటున్న జీవన్ అనే బాలుడిపై శుక్రవారం సాయంత్రం వీధికుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పర్వతాల మహేష్, సరిత దంపతుల కుమారుడైన జీవన్ సాయంత్రం స్కూల్ నుంచి వచ్చి ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కల గుంపు వచ్చి దాడి చేసి తలతో పాటుచెవులు, శరీరంపై పలుచోట్ల కరిచాయి. దీంతో బాలుడి అరుపులు విన్న గ్రామస్థులు కుక్కల గుంపును తరిమివేసి చికిత్స కోసం సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడిపై శుక్రవారం పిచ్చికుక్క దాడి చేసింది. గ్రామానికి చెందిన రాజలింగం అనే ఆర్‌ఎంపీ వైద్యుడు తన ఇంటి ముందు నిలబడి ఉండగా అటువైపు వచ్చిన ఓ పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. చికిత్స నిమిత్తం చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మండల కేంద్రంలో వారంపది రోజుల నుంచి పదిమందికి పైగా దాడిచేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది పిచ్చికుక్కల రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గేదెపై చిరుత దాడి..

● ఆందోళనలో అన్నదాతలు..

వేములవాడ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ శివారులో రైతుకు చెందిన గేదెపై చిరుతపులి దాడి చేయడంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి నారాయణ రోజులాగే తన పొలం వద్ద ఉన్న షెడ్డులో గేదెను కట్టివేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం వెళ్లి చూడగా గేదెపై దాడి చేసి ఉండడం, వెనుక భాగం పూర్తిగా తిని ఉండటం చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. వెంటనే స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా గేదెపై పులి దాడి చేసినట్లు ఉంది. ఫారెస్ట్‌అధికారి ఖలీల్ ఉద్దీన్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇంకా పులి అనే విషయాన్ని ఆయన నిర్ధారణ చేయలేదని, గేదెను చంపిన అనంతరం పులి అటవీప్రాంతానికి వెళ్లినట్లు అక్కడ ఉన్న మహిళలు భయపడుతున్నారు. పులి పాదాలకు సంబంధించిన ఆనవాళ్ల కనబడడంతో సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరికి చెందిన జీల మల్లేశ్‌యాదవ్ అనే రైతుకు చెందిన లేగ దూడ శుక్రవారం హైనాదాడిలో మృతి చెందింది. వ్యవసాయ బావివద్ద రోజువారిగానే పశువులను కట్టేసి వచ్చిన మల్లేశ్ శుక్రవారం ఉదయం బావి వద్దకు వెళ్లేసరికి లేగదూడమృతి చెందిఉంది. ఈవిషయం ఫారెస్టు, రెవెన్యూఅధికారుకు తెలియజేసి నట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాముడిపెంట ప్రాంతంలోని తాళంవేసి ఉన్నఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్‌ఐ రామచంద్రుడు శుక్రవారం తెలిపారు. పోలీసులు, బాధితుడు మైలారం అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య తన కుటుంబసభ్యులతో వారం రోజుల క్రితం హైదరాబాదులోని కుమారుడి వద్దకు వెళ్లారు. గురువారం రాత్రి సమయంలో ఇంటికి తిరిగి రాగా తలుపులకు వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉండగా, ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉంది. దీంతో అంజయ్య పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రామచంద్రుడు సంఘటన స్థలానికి చేరుకోని పరిశీలించాడు. బీరువాలో ఉన్న మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, 50వేల రూపాయల నగదు అపహరణకు గురియినట్లు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామచంద్రుడు తెలిపాడు.

వేములవాడలో..

వేములవాడ టౌన్: పట్టణంలోని మున్నూరుకాపుసత్రం సమీపంలో తాళంవేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కుమార్ అనే ఇంటి యజమాని వేడుక నిమిత్తం గురువారం ఇంటికి తాళంవేసి ఊరికి వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండగా గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోని దాదాపు తులం బంగారు ఆభరణాలతో పాటు 30 తులాల వెండి ఆభరణాలు చోరీఅయ్యాయని వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లోని కాకతీయ పాఠశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేగంగా, అజాగ్రత్తగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ రోడ్డు పక్కన ఆగిఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్నఇద్దరిలో యాకూబ్‌కు తీవ్రగాయాలు కాగా, ముజాహిద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనేవారిని108లో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ బస్‌లో వ్యక్తి మృతి

వీణవంక, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఒడ్డెపల్లి ఓదేలు(58) ఆర్టీసీ బస్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఓదెలు కరీంనగర్‌లో ఓ ప్రైవేటు బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజువారిగా శుక్రవారం సాయంత్రం ఆర్టీసీబస్‌లో రెడ్డిపల్లి నుంచి కరీంనగర్ వెళ్లాడు. బస్సు అల్గునూరు వద్దకు వెళ్లగానే పక్కకు పడిపోవడంతో గమనించిన తోటి ప్రయాణికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందిచడంతో అసుపత్రికి వెళ్లినట్లు తెలిపారు.

మహాలక్ష్మి ఇబ్బందులు తొలగేనా?

● ఆర్టీసీలో పెరగని బస్సులు ● పెరిగిన మహిళల రద్దీ



కరీంనగర్ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు

బగత్‌నగర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారినా, అందుకనుగుణంగా తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల సంఖ్య పెంచక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత వచ్చే రెండవ మహిళా దినోత్సవం నుంచైనా మహిళల కోసం అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను పెంచి ఇబ్బందులు తొలగించాలని మహిళలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం (మహాలక్ష్మి) పథకాన్ని అమలు చేసినా దానికనుగుణంగా బస్సు సర్వీసులు లేక మహిళామణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోలు ఉండగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ, హుస్నాబాద్, హుజూరాబాద్, గోదావరిఖని, మంథని డిపోలు ఉన్నాయి. రీజియన్ వ్యాప్తంగా తొమ్మిది వందలపైచిలుకు బస్సులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రూట్లలో బస్సులు నడిపిస్తున్నా పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచక పోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త బస్సులను ప్రవేశపెడతామని చెప్పిన ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను మాత్రం తీసుకు వచ్చింది. ఎలక్ట్రిక్ బస్సులు పట్టణాలకే పరిమితమవడంతో గ్రామీణ ప్రాంతాలకు బస్సుల కొరత ఉంది. కరీంనగర్ నుంచి రాయపట్నం, గోదావరిఖని, జగిత్యాల, హుజూరా బాద్ రూట్లలో మహిళల రద్దీ తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్- రాయ పట్నం రూట్‌లో మహాలక్ష్మి పథకానికంటే ముందే రద్దీ తీవ్రత ఎక్కువగా ఉండేది, మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత మహిళల రద్దీ పెరగడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

మహిళలు ఉన్న చోట్ల ఆగని బస్సులు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో బస్టాండ్లలోనే బస్సులు నిండిపోతున్నాయి. ప్లాట్ ఫాంలపైకి రాక ముందే బస్సుల్లోకి ఎక్కేందుకు ప్రయాణికులు హైరానా పడుతున్నారు. ఉన్న కొద్ది పాటి బస్సులతోనే అన్ని రూట్లలో బస్సులు నడిపిస్తున్నా రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ దాటినతర్వాత బస్సులు ఎక్కాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. నగరంలోని వివిధ బస్టాప్‌లలో మహిళలు ఎక్కువగా ఉంటే డ్రైవర్లు బస్సులు ఆపడం లేదని అంటున్నారు. మహిలలను డ్రైవర్లు, కండక్టర్లు చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకునైనా అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను పెంచే ప్రకటన చేయాలని మహిళలు కోరుతున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు వినియోగించుకునేలా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కృషి చేయాలని మహిళలు కోరుతున్నారు.

బస్సులు ఆపడం లేదు: సాహితి, విద్యార్థిని



మహిళలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో బస్సులు ఆపడం లేదు. విద్యార్థులు దూరప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. మహాలక్ష్మి పథకం మహిళలు వినియోగించుకునే విధంగా బస్సులు ఆపాలి. బస్సుల సంఖ్యను పెంచాలి.

బస్సుల సంఖ్యను పెంచాలి: కీర్తన, గృహిణి



పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఎక్కువగా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేక బస్సులు ఆర్టీసీ నడిపించాలి.



బస్సును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్న లారీ



డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయిన లారీ

కోరుట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెనుప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సును తప్పించబోయి భారీలోడుతో వస్తున్న లారీ డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో బస్సులోఉన్న ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం జగిత్యాల నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీబస్సు డ్రైవర్ గమనించకుండా ఇన్‌గేట్ నుంచి బస్టాండ్‌లోకి బస్సును తీసుకుపోతున్నాడు. ఇదే సమయంలో మెట్‌పల్లి నుంచి జగిత్యాలవైపు వెళ్తున్న లారీడ్రైవర్ బస్సును తప్పించబోయాడు. దీంతో పక్కనే ఉన్న డీవైడర్‌ను ఢీకొట్టింది. సంఘ టనలో ఎలాంటి ప్రాణనష్టం చోటు చేసుకోలేదు. ఈ సంఘటనతో బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

దేవాలయాల్లో చోరీ

శంకరపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రేణుకఎల్లమ్మ, పోచమ్మదేవాలయాల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మొలంగూర్ గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్‌గ్రామంలోని రేణుక ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయాల్లో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలకొట్టి ప్రవేశించారు. ఆలయంలోని హుండీల తాళాలను ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరగడం ఇది మూడోసారి అని గౌడసంఘం నాయకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం రగుడు చౌరస్తాలోని మహాశివరాత్రి సందర్భంగా కట్టెలతో ఏర్పాటుచేసిన కమాన్‌లో శుక్రవారం రాత్రి బైక్ ఇరుక్కొని ముస్తాబాద్ మండలం తుర్కపల్లికి చెందిన ప్రశాంత్(32)కు తీవ్రగాయాలయ్యాయి. వేములవాడ నుంచి సిరిసిల్ల వైపు ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. తీవ్రగాయాలతో కమాన్‌లో ఇరుకున్న యువకుడిని స్థానికులు బయటకు తీసి చికిత్స కోసం సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

వేములవాడ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణం తిప్పాపూర్ శివారులోరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఆగిఉన్న లారీని కారు ఢీకొట్టింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్సై సముద్రాల రాజు ఘటన స్థలానికిచేరుకొని ప్రమాదానికిగల కారణాలను పరిశీలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్యేలకు రూ. ఐదు కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు

● నిధుల ఖర్చులో వేసవిలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి ● మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు... సంస్థాగతంగా బలోపేతం కావాలి ● ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సమీక్షా సమావేశం



సమావేశంలో చర్చిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

కరీంనగర్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి నియోజకవర్గానికి స్పెషల్‌డెవలప్‌మెంట్‌ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద 5కోట్ల రూపాయలు ఇస్తున్నామని, గతంలో ఇచ్చిన 10కోట్లకు ఇవి అదనమని ఉమ్మడిజిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సంబంధించి పెండింగ్ అంశాలు, అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లోని జలసౌధలో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గతంలో ఎస్‌డీఎఫ్ 10 కోట్ల నిధుల్లో ఎంత వరకు పనులు జరిగాయని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మంజూరు చేస్తున్న ఐదు కోట్ల నిధులను తాగునీటి సంబంధ అవసరాలకు మొదటి ప్రాధాన్యంతో ఖర్చుచేయాలని మంత్రులు సూచించారు. అనంతరం ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై చర్చించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, మరో మూడు నెలల్లో స్థానికసంస్థల ఎన్నికలు ఉంటాయని మంత్రి తెలిపారు. ఈలోగా నియోజకవర్గాల్లో నీటి పారుదలకు సంబంధించిన పెండింగ్ పనులుంటే త్వరగా పూర్తి చేసేలాచర్యలు తీసుకోవాలని సూచించారు. శాసనసభ్యులు కలిసి కట్టుగా జిల్లా అభివృద్ధిపై దృష్టిని సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణా రావు, సంజయ్‌కుమార్, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పురుమల్ల శ్రీనివాస్, జువ్వాడి నర్సింగరావు, ప్రణవ్‌బాబు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న కేంద్ర సమాచార, ప్రసారభారతి అధికారులు

వేములవాడ కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వరస్వామి వారిని శుక్రవారం కేంద్ర సమాచార శాఖ ప్రసారభారతి అధికారులు దర్శించుకున్నారు. ప్రసారభారతి తెలంగాణ క్లస్టర్ హెడ్ హరిసింగ్, దక్షిణాది రాష్ట్రాల జోనల్ హెడ్ గీతారాణిలు దర్శించుకునిప్రత్యేకపూజలు నిర్వహించారు. ముందుగా కోడెమొక్కు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ శ్రీనివాస్, టిసి లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది ఉన్నారు.



ఆశీర్వదిస్తున్న అర్చకులు

కొడుకును ఉద్యోగంలో పెట్టించేందుకు నకిలీ ధ్రువపత్రాల సృష్టి

● తండ్రితో పాటు సహకరించిన ముగ్గురి రిమాండ్ ● నిందితుల్లో విశ్రాంత తహసీల్దార్, డీఎంహెచ్‌వో ఉద్యోగి



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కొడుకును ఉద్యోగంలో పెట్టించేందుకు నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించిన తండ్రితోపాటు ఆయనకు సహకరించిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నిందితుల్లో కరీంనగర్ పట్టణానికి చెందిన విశ్రాంత తహసీల్దార్ చిమ్మల బీరయ్య, డీఎంహెచ్‌వోలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ బాసిద్ హుస్సేన్‌లు ఉన్నారని చెప్పారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వివరాలను ఆయన వెల్లడించారు. మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పశు వైద్యశాలలో లైవ్‌స్టాక్ అధికారిగా పని చేస్తున్న కరీంనగర్ పట్టణానికి చెందిన జడ కొమురయ్య కాలేయ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నానని, అనారోగ్య కారణంగా ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ పొందేందుకు రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆయన దరఖాస్తును పరిశీలించారు. దాంతో కొమురయ్య నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించారని ఎల్లారెడ్డిపేట పశు వైద్యాధికారి ఈ నెల 1న స్థానిక పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రమాకాంత్ కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తును చేపట్టారు. జడ కొమురయ్య తాను అనారోగ్య కారణంగా ఉద్యోగవిరమణ పొంది కొడుకును తనస్థానంలో ఉద్యోగంలో పెట్టించాలని కరీంనగర్‌కు చెందిన విశ్రాంత తహసీల్దార్ చిమ్మల బీరయ్యను సంప్రదించారు. అందుకు రూ.3లక్షలు ఇవ్వాలని బీరయ్య చెప్పడంతో కొమురయ్య అప్పగించారు. విశ్రాంత తహసీల్దార్ బీరయ్యకు డీఎంహెచ్‌వోలో విధులు నిర్వహిస్తున్న మహ్మద్ బాసిద్ హుస్సేన్‌ను పరిచయం చేసి వివరాలు తెలిపారు. ఆయనకు తెలిసిన కరీంనగర్‌లోని ల్యాబ్ టెక్నీషియన్ కొత్తపల్లి రాజేశంను కలవాలని సూచించారు. రాజేశం వద్ద కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆసుపత్రికి సంబంధించిన నకిలీపత్రాలు, స్టాంపులు, అందుబాటులోని లేని వైద్యుల సంతకాలు ఫోర్జరీ చేసి ధ్రువీకరణ పత్రాలను సృష్టించామని విచారణలో అంగీకరించారు. వారి వద్ద నుంచి ఆసుపత్రికి సంబంధించిన నకిలీపత్రాలు, 18 నకిలీ స్టాంపులు, కంప్యూటర్, మానిటర్, సీపీయూ, పవర్ కేబుల్, సిస్టం లింక్ కేబుల్‌ను స్వాధీనపర్చుకున్నామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు. ఆయన వెంట ఎస్‌ఐ రమాకాంత్ ఉన్నారు.

పెళ్లి ఊరేగింపులో కారు ఢీకొని మహిళ మృతి



ఉమ (ఫైల్)

శంకరపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పెళ్లి ఊరేగింపులో కారు ఢీకొని మహిళమృతిచెందిన సంఘటన మండలంలోని మెట్‌పల్లిగ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. ఈనెల6 గురువారం రోజున మెట్‌పల్లిలో బకారపు ప్రభాకర్ కుమార్తె నవ్య వివాహం మానకొండూర్ మండలం చెంజర్లకు చెందిన జినుక అశోక్‌తో జరిగింది. సాయంత్రం అప్పగింతలు అయిన తర్వాత కారు డ్రైవర్ కురుమ శ్రావణ్ ప్రభాకర్ ఇంటినుంచి నూతన వధూ వరులను, బంధువులను కారులో తీసుకొని ఊరేగింపు కార్యక్రమానికి బయలు దేరారు. ఊరేగింపులో భాగంగా నృత్యాలు చేస్తుండగా డ్రైవర్ శ్రావణ్‌కు ఫోన్ రావడంతో కారు దిగి పక్కకెళ్లి మట్లాడుతున్నాడు. ఈక్రమంలో పెళ్లి కుమారుడు అశోక్ కారును హఠాత్తుగా ముందుకు పోనిచ్చాడు. దీంతో కారు అక్కడ నృత్యాలు చేస్తున్న బకారపు ఉమ(35), కూతురు బకారపు నిఖితతోపాటు పలువురు పైకి దూసుకెళ్లింది. వెంటనే ఉమను భర్త పర్శరాములు హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం వరంగల్ ఎంజీఎంకు, అక్కడినుంచి హైదరాబాద్ తీసుకెళ్తుండగా శుక్రవారం తెల్లవారుజామున మార్గమధ్యలో మృతిచెందింది. ఉమ కూతురు నిఖితకు కుడి భుజం, కాలు విరిగింది. మృతురాలి భర్త బకారపు పర్శరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

న్యాయం చేయాలంటూ ఆందోళన..

హుజూరాబాద్: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి ఎదుట శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలోని పెళ్లి ఊరేగింపులో గాయపడి మృతిచెందిన బకారపు ఉమ, గాయపడిన వారికి నష్టపరిహారం అందించి న్యాయంచేయాలని శుక్రవారం బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఎండుతున్న పంటలు.. రోడ్డెక్కిన రైతులు..

● సిద్దిపేట-కామారెడ్డి రహదారిపై బైఠాయింపు



గంభీరావుపేట పెద్ద కాలువ వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతులు

గంభీరావుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట పెద్ద కాలువ ఆయకట్టు రైతులు రోడెక్కారు. పంటలు ఎండుతుండటంతో సిద్దిపేట- కామారెడ్డి రోడ్డుపై బైఠాయించి, సాగునీరు ఇవ్వాలనిడిమాండ్ చేశారు. ఎగువమానేరు నీటిని నమ్ముకుని పెద్ద కాలువ కింద 2000ఎకరాలకు పైగా పంటలు వేశామని, ఇప్పుడు పెద్ద కాలువలో చుక్కనీరు లేదని వాపోయారు. ఎగువ మానేరు నీటిని పెద్ద కాలువలోకి విడుదల చేస్తేనే పంటలు దక్కే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రత్యేక తూం ఏర్పాటు చేస్తేనే పెద్ద కాలువ ఆయకట్టు రైతుల సమస్యకు శాస్వత పరిష్కారం దొరుకుందన్నారు. సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రోడ్డుపై ఆందోళన చేయడంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. రైతుల ఆందోళనకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. పరిస్థితి తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్‌లు అక్కడికి చేరుకుని వారిని శాంతింపచేసే ప్రయత్నం చేశారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా ఆందోళన విరమించాలని పోలీసుల సూచనల మేరకు రైతులు శాంతించారు. ఈ ఆందోళనలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, స్వామి, రాజు, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.





హక్కుల కోసం పోరాడాలి..

డాక్టర్ కె శ్రీవాణి, అర్థశాస్త్రం విభాగం అధిపతి, శాతవాహన విశ్వవిద్యాలయం

మహిళా హక్కుల కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి మహిళామణుల స్ఫూర్తిని స్మరించుకుంటు ముందుకు సాగాలి. మహిళా సాధికారత అనేది ఒక్క రోజులో సాధించలేము. ప్రతిరోజు మనం ఒక ముందడుగు వేస్తే కచ్చితంగా లక్ష్యాన్ని చేరుకోగలం. మహిళా దినోత్సవం మహిళల హక్కుల కోసం పోరాడేందుకు, లింగ సమానత్వం సాధించేందుకు ఒక గొప్ప అవకాశం.



మహిళా సాధికారతను ప్రోత్సహించాలి..

మెట్టు విజయలక్ష్మి, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ

ప్రజాసామ్యంలో మహిళలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ప్రజాసామ్య వ్యవస్థ సమాన హక్కులు, అవకాశాలను అందించే సిద్ధాంతంపై ఆధారపడి ఉంటుంది. మహిళల హక్కులు, స్వేచ్ఛ, రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వంలాంటి వాటిని ప్రోత్సహించాలి. పురుషులతో సమాన హక్కులను మహిళలకు కల్పించడంతో పాటు మహిళా సాధికారతను ప్రోత్సహించాలి. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం ప్రజాస్వామ్య వ్యవస్థలో కల్పించాలి. మహిళలపై వివక్ష, లింగ అసమానతలు, హింస వంటి సమస్యలను ఎదుర్కోవడానికి చట్టాలు, విధానాలను రూపొందించాలి.



అసమానతలు తొలగాలి..

డాక్టర్ స్రవంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్

ఇప్పటికీ మహిళలపై అణచివేత కొనసాగుతూనే ఉంది. మహిళలు అన్ని రంగాల్లోకి ముందుకు రావాలంటే విద్య ఉద్యోగం వ్యాపారం రాజకీయాల్లో సరైన భాగస్వామ్యం అనేది తప్పనిసరి. అసమానతలు తొలగినప్పుడే ఇది సాధ్యమవుతుంది. సమాజంలో ఒక మహిళను బలపరిస్తే ఆమె ఒక కుటుంబాన్ని బలపరుస్తుంది. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి.

అన్ని రంగాల్లో ప్రాధాన్యమివ్వాలి..

మిట్టగడుపల సౌజన్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, సిరిసిల్ల



మహిళలు చేయలేని పనులు లేవు. అన్ని పనులను ఎలాంటి కష్టం లేకుండానే చేసుకుంటూ పోతుంటారు. మహిళలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పడమే తప్ప ఎక్కడా అమలు చేయడంలేదు. కనీసం గుర్తించడం కూడా లేదు. నిరంతరం ఎలాంటి అలసట లేకుండా కష్టపడుతున్న మహిళలకు సమాజంలోని అన్నిరంగాల్లో ప్రాధాన్యమివ్వాలి. ఆదరించి గుర్తింపునివ్వాలి.

సమాన హక్కులు కల్పించాలి..

ఎంఏ భారతి, జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ, సిరిసిల్ల



సమాజంలో మహిళలకు పురుషులతో సమాన హక్కులను కల్పించడంతో పాటు స్వేచ్ఛను ఇవ్వాలి. కుటుంబాల్లో మహిళలను పురుషులతో సమానంగా చూడాలి. చదువు నేర్పించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల విషయంలోనే కాకుండా ప్రతి విషయంలో కూడా ఆడ,మగ సమానం అనే ఆలోచన విధానంతో ప్రతి ఒక్కరూ ఉండాలి. మహిళలు అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుకెళ్లాలి. ఎలాంటి ఒత్తిళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.

ఆకాశంలో సగం



ప్రపంచానికి మార్గదర్శకంగా మహిళా శక్తి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారు. 2025 మహిళా దినోత్సవాన్ని 'ప్రతి మహిళకూ, ప్రతి బాలికకూ హక్కులు, సమానత్వం, సాధికారత' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళలు సాంకేతిక రంగంలో రాణించడం, సమాన అవకాశాలు పొందడం, డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ థీమ్ ముఖ్య ఉద్దేశం. 1975 మార్చి 8న ఐక్యరాజ్యసమితి అధికారికంగా ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రతిపాదించింది.

-గణేశ్‌నగర్, కరీంనగర్ టౌన్, కరీంనగర్ కల్చరల్, జగిత్యాల, సిరిసిల్ల

కరీంనగర్ సమీపంలోని ఎల్‌ఎండీలో తెప్ప నడుపుతున్న యువతి

అన్ని రంగాల్లో రాణించాలి

బీఎస్ లత, అదనపు కలెక్టర్, జగిత్యాల



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి. విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయం, వ్యాపారం ఇలా పలురంగాల్లో మహిళలు కీలకపాత్రను పోషించాలి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. వంటింటికి మహిళలు పరిమితం కాదని, అవసరమైన ఏబాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వర్తిస్తారని చాటాలి. గొప్పగొప్ప మహిళల నేపథ్యాలను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలి.

వెనుకబాటుతనం పోవాలి..

సత్యమ్మ, జిల్లా ఉపాధి కల్పనాధికారి, జగిత్యాల



మహిళల్లో వెనుకబాటుతనం పారద్రోలేందుకు వారిలో ధైర్యం కల్పించాలి. మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహించి చట్టాలు, శిక్షలపై వారికి వివరిస్తూనే మనోధైర్యం పెంచాలి. అన్నిరంగాల్లో ధైర్యంగా ముందుకు వచ్చే విధంగా వారికి ప్రోత్సాహం కావాలి. వారిలో చైతన్యం తీసుకువచ్చే విధంగా స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాలు చేపట్టాలి.

మహిళలు తమ శక్తిని చాటుకోవాలి

సీహెచ్ సోఫియా, జిల్లా కోశాధికారి, జగిత్యాల



మహిళలు వంటింటికే పరిమితం కాకూడదు. చదువులో ముందుండి ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ శక్తిని చాటుకోవాలి. తమకు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని స్వశక్తితో ముందుకు వెళ్లాలి. సమాజంలో మహిళల పాత్ర ఎంత గొప్పదనే విషయాన్ని ప్రతీ ఒక్కరికి అర్థమయ్యేలా ఎదగాలి. మహిళ ఉద్యోగులను గౌరవించాలి.

దిక్సూచిగా నిలవాలి

సుజాత, డిస్ట్రిక్ట్ ఆడిట్ అధికారి, జగిత్యాల



ఒకప్పుడు నాలుగు గోడల మధ్య వంటింటి కుందేళ్లుగా మహిళలు ఉండే వారు. ఈరోజు మహిళ లు అన్ని రంగాల్లో రాణిస్తు న్నారు. స్వశక్తితో మహిళలు రాజకీయ రంగాల్లో దూసుకెళ్తున్నారు. ఉద్యోగం స్త్రీ బాధ్యతగా చేపట్టినప్పుడే మహిళా లోకం ఆర్థికంగా ఎదుగుతారు. సమాజానికి దిక్సూచిగా మహిళలు నిలవాలి.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

డాక్టర్ సుజాత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, కరీంనగర్

మహిళలు ఆర్థిక స్వతంత్రత సాధించాలి. అది విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. విద్య ద్వారా మానసికోల్లాసం కూడా లభిస్తుంది. మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించడం ద్వారా పేదరికంతోపాటు ఆధారపడడమనే చక్రాన్ని విచ్ఛిన్నం చేయవచ్చు.





మహిళల హక్కులపై అవగాహన కల్పించాలి

డాక్టర్ పాలాస మాధవి, ప్రొఫెసర్, చల్మెడ మెడికల్ కాలేజీ.

మహిళల హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇది అందరూ బాధ్యతగా తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నవయస్సులో పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి. విద్య, ఉద్యోగ రంగాల్లో లింగ వివక్ష లేకుండా చూడాలి.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కె.సబిత, జిల్లా సంక్షేమ అధికారి, కరీంనగర్

మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో చాలా మంది ఉపాధిపొందుతున్నారు. వ్యాపార రంగంలోనూ రాణించాలి ఏ రంగంలోనైనా విజయం సాధించగలమనే విశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగాలి.





మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

కట్ట మంజులాదేవి, సూపరింటెండెంట్, జవహర్ బాలభవన్

అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రతీ మహిళా ఎవరినో ఒకరిని స్ఫూర్తిగా తీసుకోవాలి. నాకు స్ఫూర్తి ఎంఎస్ సుబ్బులక్ష్మి. అందుకే సంగీతం నేర్చుకున్నా... నేర్పుతున్నా. కొన్నేళ్లుగా బాలభవన్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నా.

స్వతంత్రంగా జీవించాలి..

ప్రొఫెసర్ డి వరలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్



మహిళలు స్వతంత్రంగా జీవించాలి. నిరంతర నైపుణ్యాలు మెరుగుపరచడం, వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధి కోసం ప్రయత్నించాలి. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి.

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలి

సీహెచ్ నిరోష, లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మానకొండూర్



మహిళలు పని ప్రదేశంలో ఇంకా మహిళలు సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలి. అన్ని రంగాల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ

నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్



అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉంటున్నారు. ఇది గొప్ప విషయం. మహిళలు తలచుకుంటే కానిదేమీ ఉండదు. ధైర్యంతో ఇంకా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ఓ మహిళా అధికారిగా ఆనందంగా ఉంది.

మహిళా సాధికారత సాధించాలి

ఎ.సరిత, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కరీంనగర్

మహిళలు అన్ని అంశాల్లో సాధికారత సాధించాలి. గ్రంథాలయంలో మహిళలు, యువతులు, విద్యార్థినుల పఠన కోసం సంస్థ చైర్మన్ చొరవతో ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. మహిళల రక్షణ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు, సేవలపై అవగాహన పెంచుకోవాలి.



మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్, కరీంనగర్ నగర పాలక సంస్థ

మహిళలకు ఏ బాధ్యత అప్పగించినా అది నిబద్ధతతో పూర్తి చేస్తారు. ఏ పనిలోనైనా నమ్మకం, విశ్వాసం కలిగి ఉంటూ అన్ని రంగాల్లో రాణిస్తారు. చదువులో ముందుండి అనుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడే సమాజం గౌరవిస్తుంది. సమాజంలో గౌరవం పొందేందుకు ప్రతి మహిళా పట్టుదలతో ముందుకెళ్లాలి.





కలిసికట్టుగా స్వయం ఉపాధి వైపు..



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న పెద్దపల్లి కలెక్టర్ శ్రీహర్ష

- **చిల్లపల్లి గ్రామానికి జాతీయ పురస్కారం**
- **రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం**
- **ప్రోత్సాహకంగా రూ. 75 లక్షలు**
- **అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చిల్లపల్లి సక్సెస్ స్టోరీ**

మంథని/మంథనిరూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఐక్యత, క్రమశిక్షణ, పర స్పర సహకారంతో మంథని మండలంలోని చిల్లపల్లి మహిళలు స్వయం ఉపాధి పొందుతూ వివిధ రకాల వ్యాపారాలతో ఆర్థికంగా ఎదుగుతున్నారు. తమ చదువును, పొందిన వృత్తి నైపుణ్యాన్ని ఉపాధి వైపు మళ్లించి ఇంతింతై వటుడింతై అన్నట్లుగా స్వయం సమృద్ధిలో దూసుకెళ్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు గ్రామంలో శ్రీజ్యోతి మహిళా గ్రామైక్య సంఘంలోని 33 సొసైటీల్లో సభ్యులుగా ఉన్న 335 మంది చేయిచేయి కలిపారు. అయితే డబ్బును పొదుపు చేయడమే కాదు కాలానికి అనుగుణంగా పురుషులతో సమానంగా పోటీ పడి ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రణాళికలు వేసుకున్నారు. ఈ క్రమంలో స్వయంగా ఉపాధి వైపు అడుగులు వేసి విజయవంతమయ్యారు. తమ డబ్బును సంఘాలలో జమ చేసుకుంటూ, అందులో నుంచే రూపాయి వడ్డీకి రుణం తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో వీరంతా కిరాణ షాపులు, కుట్టు మిషన్లు, కోళ్ల పెంపకం, పాడిగేదెలు, కంగన్ హాల్, చికెన్ షాప్, బ్యూటీపార్లర్స్, టిఫిన్ సెంటర్లు, డ్రాగన్ ఫ్రూట్స్ తోట, పిండి గిర్ని, కూరగాయల సాగు, మెడికల్ షాపు, ఐకేపీ సెంటర్ నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయడం తదితర పనులతో మహిళలు స్వయం ఉపాధితోపాటు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. తమ సంఘాల్లో రూపాయి వడ్డీకి రుణం తీసుకుని ఉపాధి పొందుతూ వివిధ వ్యాపారాల్లో రాణిస్తూ, గ్రామాభివృద్ధిలో కీలకంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామంగా గుర్తించింది.

దేశ వ్యాప్తంగా 27 గ్రామ పంచాయతీల్లో గ్రామంలో 9 అంశాలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు ప్రకటించగా ఇందులో ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో చిల్లపల్లి పంచాయతీకి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం దక్కింది. 2024 డిసెంబర్ 11న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ కోయ శ్రీహర్ష పురస్కారం అందుకున్నారు. పురస్కారం తోపాటు రూ. 75 లక్షల నగదు ప్రోత్సాహాన్ని గ్రామానికి దక్కేలా చిల్లపల్లి గ్రామ మహిళలు తమ శక్తిని చాటారు.





గ్రామంలో మహిళా సంఘం సభ్యుల సమావేశం, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

పని చేసుకుంటూనే టైలరింగ్‌లో శిక్షణనిస్తున్నా

రామిళ్ళ మల్లేశ్వరి, చిల్లపల్లి.



భర్త వ్యవసాయం చేస్తుండగా నేను కుట్టు పని చేసుకుంటూ ఉపాధి పొందుతున్నా. అలాగే గ్రామంలోని చాలా మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నా. ఇప్పటి వరకు 40 మంది మహిళకు పైగా శిక్షణ ఇచ్చాను. జ్ఞానోదయ పొదుపు సంఘంలో రెండేళ్ల కిందట రూ.లక్ష రుణం తీసుకొని కుట్టు యంత్రాలు కొనుగోలు చేశాను. కుట్టు పని, శిక్షణ తోపాటు చీరలు, దుస్తులు అమ్ముతున్నా. వీటి ద్వారా ఆదాయం పొందుతున్నాను.

మహిళల కృషితోనే జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు

ఆరె సౌజన్య, సీఏ, చిల్లపల్లి.



శ్రీజ్యోతి గ్రామైక్య సంఘంలో సభ్యులందరితో నెలకు రెండు సార్లు మీటింగ్ పెట్టుకుంటాం. ఇందులో ఆర్థిక లావాదేవీలతోపాటు మహిళల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన అంశాలపై చర్చిస్తాం. సంఘంలోని సభ్యులందరు వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవటానికి లోన్లు తీసుకొని తిరిగి వడ్డీతో కలిసి చెల్లిస్తుండటంతో ఇతర సభ్యులకు రుణాలు సకాలంలో ఇవ్వటానికి వీలుకల్గుతుంది. సంఘ సభ్యుల స్వయం ఉపాధితో గ్రామంలో వారి కుటుంబాలు అన్ని విధాలుగా సంతోషంగా ఉన్నాయి. వీరి ఆర్థిక క్రమశిక్షణ, స్వావలంబన, స్వయం ఉపాధి జాతీయ స్థాయిలో మా గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడం సంతోషంగా ఉంది.

ప్రభుత్వ తోడ్పాటు మహిళల ఆర్థిక పురోగతి

మహిళా గ్రూపులలో సభ్యులు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. గ్రూపు సభ్యులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడంతో మహిళలు పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కుటుంబానికి ఆర్థిక అండగా నిలుస్తున్నారు. నెలనెలా బ్యాంకు రుణాలు చెల్లిస్తూ ముందుకు సాగుతున్నారు. మరి కొందరు మహిళలు ఇందిరా క్రాంతి పథ కాన్ని సద్వినియోగం చేసుకొని క్యాంటిన్ నిర్వహిస్తున్నారు. పిండి వంటలు, పచ్చళ్ళు తయారు చేస్తూ తమ కాళ్ళపై తాము నిలబ డుతూ శభాష్ అనిపించుకుంటున్నారు.

- 'స్వశక్తి'తో ఎదుగుతున్న మహిళలు
- మహిళా శక్తి క్యాంటిన్ నిర్వహణ
- టైలరింగ్‌తో పలువురి ఉపాధి
- పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- కుటుంబాలకు అండగా...

ధర్మారం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మహిళలు క్యాంటిన్ నిర్వహిస్తు అం దరి మన్ననలు పొందుతున్నారు. మహిళా సంఘ గ్రూపులలో సభ్యులుగా ఉన్న వీరు క్యాం టిన్ నిర్వహణకు ప్రభుత్వం అవకాశం కల్పి స్తుందని విని ఆ దిశగా అడుగులు వేశారు. ఐదుగురు సభ్యులు ఒక్కటై క్యాంటిన్ నిర్వహణ చేపట్టారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చొరవతో కాంప్లెక్స్‌లోని రెండు షట్టర్లను ఉచితంగా తీసుకున్నారు. హోటల్‌లో అవస రమైన ఫర్నీచర్, కిచెన్ సామాగ్రి కోసం 7 లక్షల రూపాయలు అవసరం కాగ, వీఓ గ్రూపులలో నుంచి రూ.4 లక్షలు, బ్యాంకు నుంచి రూ.3 లక్షలు లోన్ తీసుకుని నాలుగు నెలల క్రితం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ పేరుతో హోటల్ ప్రారంభించారు. టిఫిన్స్ చేయడంలో మొదట కొంచెం ఇబ్బంది పడ్డా నెల తిరిగే సరికి అదిరి పోయే రుచులతో ఆకర్షిస్తున్నారు. ఇడ్లీ, వడ, దోశ, పూరి ఇలా టిఫిన్ ఏదైన రూ.30తో ఇస్తున్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మండలం ఆదివరహా స్వశక్తి సభ్యులకు 2016 పీఎం జీకే నుంచి ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా 30శాతం సబ్సిడీతో 20లక్షలు రుణం మంజూరయ్యాయి. 30మంది సభ్యులకు నెలరోజుల పాటు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ అనంతరం సభ్యులతో కలిసి 15కుట్టుమిషన్‌లతో పాటు ఇతర సామగ్రి కొనుగోలు చేసి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థుల యూనిఫాంలు, ఇతర సంస్థల అల్లికలు కుడుతూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. వచ్చిన ఆదాయం నుండి బ్యాంకులో ఈఎంఐ చెల్లిస్తూ ఒక్కో మహిళ నెలకు 8వేల నుండి 10వరకు సంపాదిస్తు కుటుంబ పోషణలో భాగస్వాములు అవుతున్నారు. అధునాతన ఎలక్ట్రానిక్ మిషన్లను కొనుగోలు చేసి చీరలకు డిజైన్లు వేస్తు వినియోగదారులను ఆకర్షిస్తు న్నారు. మహిళలు శిక్షణపొంది దీనిని ఉపాధిగా ఎంచుకున్నారు. కుట్టు శిక్షణ గ్రామీణా ప్రాంతా ల్లోని మహిళలకు ఎంతగానో ఉపయోగప డుతుంది. మండలంలో 10మంది సభ్యులకు పిండిగిర్నిలు కొనుగోలు కోసం ఒక్కొక్కరికీ 3లక్షలు పీఎంవైకే పథకం కింద రుణాలు మంజూరయ్యాయి. కమాన్‌పూర్ ఎక్స్ రోడ్‌లో నీటి శుద్ధి యంత్రం, పెరటికోళ్ల పెంపకానికి రుణాలు ఇవ్వగా లాభదాయకంగా ఉన్నాయని మహిళలు తెలుపుతున్నారు.

కాల్వశ్రీరాంపూర్: స్వశక్తి గ్రూపు రుణాలతో మండలంలోని ఆయా గ్రామాల మహిళలు ఆర్థికప్రగతి సాధిస్తున్నారు. స్వశక్తి గ్రూపు సభ్యులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడంతో మహి ళలు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు ఆవులకు, గేదెలకు, కిరాణం, బట్టలషాపులకు, టైలరింగ్, పాలవ్యా పారం, ఎరువుల దుకాణం తదితర వ్యాపారాలు చేసుకోవడం కోసం సెర్ప్‌ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు తీసుకొని వ్యాపారాలు కొనసాగి స్తున్నారు. మండలంలో 24గ్రామ పంచాయతీల్లో 924మహిళ సంఘాలు ఉన్నాయి. మహిళా సంఘాలకు ఈ సంవత్సరం సెర్ప్ ద్వారా ప్రభుత్వం 38 కోట్ల రూపాయలు ఇచ్చింది. కొందరు మహిళలు రుణాలు తీసుకొని వారి పిల్లల పైచదువులకు కూడా ఉపయోగిస్తు న్నారు. మహిళలకు ఆర్థికంగా ఎదుగుదలే లక్ష్యంగా సెర్ప్ పనిచేస్తుంది. పిల్లల వివాహాలకు కూడా రుణాలు ఉపయోగపడుతున్నాయని మహిళలు పేర్కొంటున్నారు.

ధైర్యంతో ముందుకెళ్లాం..



క్యాంటీన్ నిర్వహణ అవుతుందా అని మొదట కొంచెం భయపడ్డాం. అయినా అందరం ధైర్యంతో ముందుకెల్లాలని నిర్ణయించుకున్నాం. నాకు కరోనా టైంలో ఇంటి దగ్గర టిఫిన్స్ చేసిన అనుభవం ఉంది. దాంతో రాని పని నేర్చుకోవడం పెద్ద కష్టం ఏమి కాలేదు. అందరం కలిసి అన్ని పనులు చేస్తుంటాం. వచ్చిన డబ్బులను రోజు అందరం కలిసి లెక్క చేస్తాం. ప్రతీ నెల రెగ్యులర్‌గా బ్యాంక్ కిస్తీలను చెల్లిస్తున్నాం. ఖర్చులు పోను మిగిలిన డబ్బులు అంద రం పంచుకుంటాం. ఆర్థి కంగా నిలదొక్కుకుంటామనే నమ్మకం ఉంది.

పెరుమండ్ల లావణ్య (మహిళా శక్తి క్యాంటిన్ భాగస్వామి)

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..



ప్రభుత్వ విప్, మమ్మల్ని ప్రోత్సహించిన అధికారులకు రుణపడి ఉంటాం. హోటల్ నిర్వహణ కోసం మేము కిరాయి చెల్లించలేమని చెప్పినప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి ఉచితంగా షటర్స్ ఇప్పించారు. హోటల్ సాంక్షన్ చేయడంలో ఎంపిడీవోతో పాటు అధికారులు సహకరించారు. అందరి సహకారంతో హోటల్ మంచిగా నిర్వహిస్తున్నాం. మంచి గిరాకీ ఉంది.

మెడవేని లహరి (మహిళా శక్తి క్యాంటిన్ భాగస్వామి)

టైలరింగ్‌కు ఎంతో ఉపయోగపడ్డాయి



నేను టైలరింగ్ నేర్చుకున్నాను. కుట్టు మిషన్ కోసం డబ్బులు లేకపోవడంతో శ్రీనిధి ద్వారా లక్ష రూపాయల రుణం తీసుకొని షాపు ఏర్పా టుచేసుకున్నాను. ఆర్థికంగా ఎదుగుతున్నాను.

జంపాల నర్మద, వెన్నంపల్లి

కిరాణ దుకాణంతో ఉపాధి



నేను స్వశక్తి గ్రూపులో మహిళ సభ్యురాలిగా ఉండి బ్యాంకు ద్వారా 1,50,000ఋణం తీసుకున్నాను. కిరాణాదుకాణం నిర్వహిస్తూ ఆర్థికంగా లబ్ధిపొందుతున్నా.

బొల్లి దేవి, తారుపల్లి

పాలు అమ్ముకొని ఉపాధి



నేను సెర్ప్ ఆధ్వర్యంలో బ్యాంకు ద్వారా రెండు లక్షల రుణం తీసుకొని గేదెలను కొన్నాను. ప్రస్తుతం గేదెలపాలు అమ్ముకొని ఉపాధి పొందుతున్నాను.

ఉషనవేన రాజమ్మ, పెద్దంపేట



ధర్మారంలో క్యాంటిన్ నిర్వహిస్తున్న మహిళా శక్తి సభ్యులు

భవిష్యత్తుకు భరోసా



కుట్టుమిషన్ నేర్చుకోవడం వలన భవి ష్యత్తుకు భరోసాగా ఉంది. ఉద్యోగం కోసం ఎదురు చూడాల్సిన అవ సరం లేదు. స్వయం ఉపాధిని ఎంచుకొని కుటుంబ పోషణలోను నావంతు చేయూతనివ్వడం సంతృప్తిగా ఉంది.

కడారి మల్లీశ్వరి

త్వరలో శాపింగ్‌మాల్‌ల ఏర్పాటుకు కృషి



వివిధ రకాల కుట్టు పనులపై శిక్షణ పొంది చాలమంది సభ్యులు ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం మరింత ఆర్థిక సహాయం అందిస్తే ఫ్యాషన్ డ్రెస్ షాపింగ్‌మాల్ ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్లద్వారా దుస్తులు కుడుతూ సభ్యులు ప్రతినెల ఉపాధి పొందుతున్నారు.

ఏపీఎం శైలజాశాంతి

ప్రభుత్వం ఆసరగా ఉంటే మరింత ముందుకు



కుట్టుమిషన్‌పై ఆధారపడే మహిళలకు ప్రభుత్వం మరింత ఆసరాగా ఉంటే అభివృద్ధి సాధిస్తారు. చాలమంది నిరుపేద సభ్యులు ఆర్థిక స్వాలంబన సాధించి తమ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

పిట్టల పద్మ

పిండి వంటలతో ఉపాధి..



పిండి వంటలు తయారుచేస్తున్న పద్మ

సుల్తానాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఖాళీగా కూర్చోవడం ఇష్టం లేక కుటుంబానికి ఆదాయ వనరుగా ఉపయోగపడుతుందనే నమ్మకంతో ఓ మహిళ వేసిన ముందడుగు తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచింది. సుల్తానాబాద్ పట్టణంలోని స్వర్ణకారవీధికి చెందిన వంగల పద్మ మొదట చపాతీలు చేసి కూరలు వండి ఇవ్వడం ప్రారంభించింది. కొంత ఆదరణ రావడంతో నాలుగేళ్ళ క్రితం పోలీస్‌స్టేషన్ పక్కనే ఓ గదిని అద్దెకు తీసుకుని ఉదయం పిండి వంటలు మధ్యాహ్నం కూరలు వండి ఇవ్వడం, సాయంత్రం గోధుమ, జొన్న, రాగి చపాతీలు చేసి ఇవ్వడంతో పాటు పలు రకాల పిండి వంటలు విక్రయిం చడం ప్రారంభించారు. గిరాకీ పెరగడంతో కోడలు మమతను ఇద్దరు పని వాళ్లతో తెలంగాణ పిండి వంటల పేరిట దుకాణం ప్రారంభించింది. శుభకా ర్యాలు, పండుగల సందర్భంగా సకినాలు, గారెలు, లడ్డూలు వంటి రకరకాల పిండి వంటలు స్వీట్లు ఆర్డర్లు తీసుకుని అందిస్తున్నారు. వీటితో పాటు అన్ని రకాల పచ్చళ్ళు తయారు చేసి విక్రయిస్తు న్నారు. ఆర్డర్‌పై నాన్‌వెజ్ వండి ఇస్తున్నారు. నెల నెలా వారి కుటుంబానికి అవసరమైన ఆదాయం కన్నా కొంత పొదుపు చేసుకునేందుకు స్థిరమైన ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు.

సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న మనాలీఠాకూర్

కోల్‌సిటీటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సమాజ అభి వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముం దస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్ర వారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. అనంతరం సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు మనాలీఠా కూర్‌ను సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా, అధ్యాపకులు డాక్టర్ జి.సుబ్బారావు, అధ్యాపకుల, విద్యార్థినులు, పాల్గొన్నారు.

పాలకుర్తి: ఈసాలతక్కళ్లపల్లి శ్రీజనని మండల సమాఖ్య భవనం లో మహిళా దినోత్సవం జరుపుకు న్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మహిళ లకు పలు రకాల క్రీడా పోటీలను నిర్వహించి కేక్ కట్ చేశారు. హ్యూ మన్ ట్రాఫికింగ్ పై వివోఏలకు శిక్షణ ఇచ్చారు. ఏపీఎం సదానం దం, రాంబాబు, ఐకెపి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: మార్కండేయకాలనీలోని కృష్ణవేణి పాఠశాలలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల తల్లులకు క్రీడాపోటీలను పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపల్స్ ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించా లని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం సూ చించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మహిళల పై అత్యాచారాలు, హత్యలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వంలు విఫలం అవుతున్నాయన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపు కున్నారు. పెద్దపల్లి మహిళా పట్టణ కమిటీని, మండల కమిటీ లను ఎన్నుకున్నారు పట్టణ కమిటీ కన్వీనర్‌గా లక్ష్మి, మండల కన్వీనర్ గా పద్మతోపాటు 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పెద్దపల్లి కల్చరల్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మహిళ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. మహిళ దినోత్సవ వేడుకల గోడపత్రిని న్యాయమూర్తి స్వప్నరాణి సునీల్ కుమార్‌రెడ్డి, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్ పాల్గొన్నారు. మహిళలు ఆటలపోటీలను ప్రారంభించారు. స్వప్నరాణి మాట్లా డుతూ మహిళలందరు వివిధ రంగాలలో అభివృద్ధి చెందాలని, మహిళల సమస్యలు తీర్చడానికి మనమంతా ముందుండాలని తెలిపారు.



ప్రైవేట్ విద్యాసంస్థలో విద్యార్థుల తల్లులకు క్రీడాపోటీలు

కళ్యాణ్‌నగర్: మహిళా రిక్షా కార్మికులు పనితో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఖని మెడికల్ కళా శాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష అన్నారు. 33వ డివి జన్‌లో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవం సంద ర్భంగా కార్పొరేషన్‌లో చెత్త సేకరించి మహిళ రిక్షా కార్మికులను సన్మానించారు. తెల్లవారుజామునే లేచి ఎండ, వాన, చలి అనక ఇంటింటా చెత్తను సేకరిస్తూ పారిశ్రామిక ప్రాంతాన్ని శుభ్రపరిచడంలో ముందు వరుసలో మహిళా కార్మికులు ఉంటున్నారన్నారు. దినేష్, గౌస్, మేదరి శ్రీనివాస్, రవి, రాజేశ్వర్‌రావు, గోవర్ధన్, పద్మ, అనసూర్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై పోరాటాలు ఉధృతం

పెద్దపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) శ్రామిక మహిళల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ జి జ్యోతి పేర్కొన్నారు. సీఐటియు ఆధ్వర్యంలో అంత ర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం సందర్భంగా వ్యవ సాయ మార్కెట్ నుంచి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జ్యోతి మాట్లాడుతూ మహిళా కార్మి కులపై జరుగుతున్న దోపిడి, ఓటు హక్కు కావాలని డిమాండ్స్‌పై చేసిన పోరాటాల ఫలితంగా అంత ర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భవిం చిందన్నారు. మహిళలపై శ్రమ దోపిడీ, లింగ వివక్ష కొనసాగుతుం దన్నారు. మహిళలపై హింస పెరుగుతుందని, అరిక ట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కరువైందని లైంగిక దాడులు పెరిగాయన్నారు. వనజారాణి, మరియ, భాగ్యలక్ష్మి, రజిత, రామలక్ష్మి, లక్ష్మి, శారద సువర్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి ముత్యంరావు నాయకులు ఎస్ రవీందర్, ఎస్ వెంకట స్వామి శ్రామిక మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పాలకుర్తి, మార్చి8(ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కళ్లపల్లిలో శుక్రవారం మక్కాన్‌సింగ్ సేవసమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ ఉపాధిహామీ కూలీలతో సమావేశమయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమన్నారు. సమస్యలను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముక్కెర శ్రీనివాస్ గౌడ్, నాయకులు,కార్యకర్తలు, కూలీలు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో బి-జోన్ క్రికెట్‌పోటీల్లో సెమిస్‌కు చెరిన వాగ్దేవి

రామగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బి-జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో వరంగల్ వాగ్దేవి కళాశాల విజేతగా నిలిచి సెమీఫైనల్స్‌కు చేరుకుంది. వరంగల్‌కు చెందిన వాగ్ధేవి కళాశాల కరీంనగర్‌కు చెందిన వాగేశ్వరీపై గెలిచి సెమిఫైనాల్స్‌కు చేరుకుంది.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో టోకెన్ సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికులు

కోల్‌సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో శుక్రవారం మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో టోకెన్ సమ్మె జరిగింది. ఉదయం గేటు వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో సమ్మెకు పిలుపునిచ్చారు. కార్మికులు మిశ్రమంగా స్పందించారు. కార్మికులు విధులు బహి ష్కరించి నిరసన వ్యక్తం చేస్తుండడంతో ఎన్‌టీపీసీ పోలీసులు జోక్యం చేసుకున్నారు. ఎస్ఐ ఉదయ్ కిరణ్ కార్మికులతో మాట్లాడారు. పరిశ్రమ గేట్ వద్ద ఆందోళ నలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మ జ్దూర్ యూనియన్ నాయకుడు అంబటి నరేష్, కార్మి కులనుద్దేశించి మాట్లాడారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజ మాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. వెం టనే వేతన సవరణ చేయాలన్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికుల ఆందోళనలకు బీఆర్‌ఎస్ నాయకులు కౌశిక హరి మద్దతు ప్రకటించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఒక్క ఉద్యోగి కూడా సంతోషంగా లేడని, ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో నిర్బంధం కొనసాగుతుందన్నారు. ఈ ఆందోళనలో కోం ద్ర రూపేష్, సలీం, కల్లేపల్లి దేవయ్య, మారం తిరు పతి, కరుణాకర్, జంగ కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

మిశ్రమ స్పందన...

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో టోకెన్ సమ్మె విషయంలో కాం ట్రాక్టు కార్మికులు మిశ్రమంగా స్పందించారు. వేతనాల విషయంలో చాలా రోజులుగా ఇబ్బంది పడుతున్న కార్మికులు ఆందోళనల్లో భాగస్వామ్యులయ్యారు. కొద్ది సేపు నిరసన తెలిపిన అనంతరం మెజార్టీ కార్మికులు విధులకు హాజరయ్యారు. కార్మికుల టోకెన్ సమ్మెతో యూరియా లోడింగ్‌కు కొంత ఆటంకం ఏర్పడింది. రేక్‌లో లోడింగ్ గంటపాటు ఆలస్యమైంది. రైల్వే నిబంధనల ప్రకారం గంట జాప్యానికి రూ.70వేల అపరాధ రుసుము పడనున్నది.

అధికారుల వైఖరితోనే వివాదాలు

(3వ పేజీ తరువాయి)

జరుగనున్న నేపథ్యంలో అన్నీ డివిజన్లలో అధికార పార్టీలో ఆశావా హులు ఎక్కువగా ఉన్నారు. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన కార్పొరే టర్లతో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు ఆయా డివిజన్లలో ప్రాతినిధ్యం ఆశిస్తున్నారు. డివిజన్లలో అధికార పార్టీ నాయ కులు, ఎమ్మెల్యేకు అనునాయులుగా ఉన్న నాయకులు ఈసారి తామే బరిలో ఉంటామంటూ ప్రచారం చేసుకుంటుండడంతో వివాదాలు మొదలవుతున్నాయి. డివిజన్లలో ఎమ్మెల్యే పర్యటనల సందర్భంగా కూడా ఆశావాహుల మధ్య వివాదాలు చోటు చేసుకుంటు న్నాయి. తమ కు అనుకూలమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు మొదలు పెట్టాలంటూ ఎవరికి వారుగా యంత్రాంగంపై ఒత్తిడి తెస్తున్నారు. ఇటీవల అభివృద్ధి చెందిన ప్రాంతాలుగా ఉన్న రెండు డివిజన్లలో అభివృద్ధి పనుల విషయంలో వివాదాలు చోటు చేసుకున్నాయి. నాయకులు ఎవరికి వారుగా ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. ముఖ్యంగా అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి పనుల్లో జోక్యం చేసుకోవడం, అధికారులు, కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్న సందర్భాలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి.

మహిళా దినోత్సవం సందర్భంగా తల్లులకు పాదపూజ



తల్లికి పాద పూజ చేస్తున్న హెచ్ఎం శ్రీనివాస్

ధర్మారం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం వేడుకల్లో భాగంగా శాయంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు వారి తల్లు లకు పాద పూజ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీని వాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగగా, ఆయన తల్లి మధు నమ్మకు సైతం పాఠశాలలో పాదపూజ చేసి శాలువాతో సత్కరించారు. విద్యార్థులకు తల్లిదండ్రుల గొప్పతనం గురించి తెలిపేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ బద్దం లక్ష్మతిరెడ్డి మాట్లాడుతూ సాయంపేట పాఠశాలలో చదువుతో పాటు విద్యార్థులకు నైతిక విలువలు నేర్పడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు కాట నర్సయ్య, ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ నరిగే ప్రమీల, ఎస్ఎంసీ మాజీ చైర్మెన్ బొడిగ నర్సయ్య, అంగన్వాడి టీచర్, బద్దం భాగ్యలక్ష్మి, విద్యార్థులు వారి తల్లులు పాల్గొన్నారు.

అయ్యప్ప గుడి నిర్మాణానికి పూజ

సుల్తానాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రీనగర్ అభయాంజనేయ స్వామి ఆలయం పక్కన చేప ట్టిన అయ్యప్ప గుడి నిర్మాణ పూజలో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే అయ్యప్పగుడి నిర్మాణ పూజల్లో పా ల్గొని పూజలు చేశారు. పదిహేను సంవత్సరాలుగా అయ్యప్ప భక్తులకు దీక్షా సమయంలో నిత్యాన్నదానం కొనసాగిస్తున్నారని, అదే స్థలంలో ఆలయ నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నా రు. దాతల సహకారంతో ఆలయాన్ని పూర్తి చేస్తామని మార్కెట్ కమి టీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్, మాజీ సర్పంచ్ పద్మ తది తరులతో పాటు పలువురు గురుస్వాములు తెలిపారు.

ఎల్ఆర్ఎస్‌ను పకడ్బందీగా అమలుచేయాలి

పెద్దపల్లిటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌ను నిబంధనల ప్రకారం పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రధా న కార్యదర్శి ఎం.దాన కిషోర్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్‌లతో వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ 2020 క్రమ బద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు పాటించాలన్నారు. మార్చి 31 లోపు చెల్లిస్తే 25 శాతం రాయితీ లభి స్తుందన్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించిన వారికి అర్హత ఉంటే స్థల క్రమబద్ధీకరణ చేసి ప్రొసీడింగ్స్ జారీ చేయాలన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డీపిఓ వీరబుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్లు వెంక టేష్, మనోహర్, డిఎల్‌పిఓ లు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భోజన్నపేట గ్రామానికి చెందిన బాలసాని రవీందర్ తాటిచెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో మోకు జారి కిందపడడంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు గమ నించి పెద్దపల్లి అనుపత్రికి తరలించారు. గాయాలపాలైన బాలసాని రవీందర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ కులస్థులు కోరారు.



మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

గోదావరిఖని, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకుని ఆర్‌జీ-1 సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఆర్‌సీఓఏక్లబ్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వేడుకలు నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో మహిళలు, మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మహిళలకు ఆటలపోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆర్జీ-2 ఏరియా మహిళా ఉద్యోగినిలకు ఆటలపోటీలను నిర్వహించారు. జీఎం ఆఫీస్ ఆవరణలో జరి గిన పోటీల్లో మహిళా ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జీఎం బండి వెంకటయ్య మాట్లాడారు. మహిళలు గతంలో కన్నా భిన్నంగా అన్ని రంగాల్లో తమ ప్రతిభ చూపుతున్నట్లు పేర్కొన్నారు. క్లిష్టమైన మైనింగ్ రంగంలో మహిళలు భాగస్వాము లు కావడం కీలక పరిణామమని తెలిపారు. ఈపోటీలోలను డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, అధికారులు మురళీకృష్ణ, షరీఫ్ మహమ్మద్‌లు పర్యవేక్షించారు.

బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గినప్పుడే మరింత సంక్షేమం



హాజరైన కార్మికసంఘం ప్రతినిధులు

గోదావరిఖని, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పోటీ మార్కెట్లో నిలదొక్కుకోవాలంటే సింగరేణి బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గాల్సిన అవసరం ఉందని, అప్పుడే ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించ డంతో పాటు మరిన్ని పథకాలను ప్రారంభించుకోవ డానికి అవకాశం ఉంటుందని సింగరేణి ఎండీ ఎన్ బలరాం అన్నారు. శుక్రవారం హైదరా బాద్ సింగరేణి భవన్‌లో గుర్తింపు కార్మిక సం ఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)తో జరిగిన 38వ నిర్మాణాత్మక సమావేశంలో మాట్లాడారు. సింగరేణి సంస్థ బొగ్గు అమ్మకం ధరలు ఎక్కువగా ఉం టున్నా యని, దీంతో క్రమంగా డిమాండ్ తగ్గుతుం దని పేర్కొన్నారు. భూగ ర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.12వేల నుంచి రూ.16 వేలకు చేరుకుంటుందన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించాలంటే ఉద్యోగులు పూర్తి పని గంటలు సద్వినియోగం చేస్తూ యంత్రాలను వినియో గించాలన్నారు. సింగరేణి సంస్థ మనుగడ కోసం సోలార్ విద్యుత్, కీలక ఖనిజాల ఉత్ప త్తి వంటి వ్యాపార విస్తరణ చర్యలను చేపట్టా ల్సి వస్తుందన్నారు.

ఏఐటీయూసీ గౌరవ అధ్య క్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాం బశివరావు మాట్లాడుతూ సింగరేణి అభి వృద్ధిలో కార్మికులు కీలకపాత్ర పోషిస్తుంటా రని, కంపెనీ అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యతనిస్తే సింగరేణికి మం చి భవిష్యత్తు ఉంటుందన్నారు. అయితే కేవ లం కంపెనీ ఉత్పత్తిని మాత్రమే దృష్టిలో పెట్టుకోకుండా కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్య క్షులు వాసిరెడ్డి సీతారామయ్య పలు సమస్యల ను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. సీఎండీ ఎన్ బలరాం మాట్లాడుతూ గుర్తింపు కార్మిక సంఘం ద్వారా వివరించిన సమస్య లపై చర్చిస్తామని, ఆర్థిక పరమైన సమస్యల పై కమిటీలు వేసి చర్యలు తీసుకుంటా మన్నారు. డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు, ఎల్‌వీ సూర్యనారాయణ, కే వెంకటేశ్వర్లు, ఈడీ(కోల్ మూమెంట్) ఎస్‌డీ ఎం సుభానీ, జీఎం(పర్సనల్) ఐఆర్, పీఎం కవితా నాయుడు, జీఎంలు, గుర్తింపు కార్మిక సంఘం నుంచి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్ పాల్గొన్నారు.